www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 5 నవంబర్ 2024

5

పశ్చిమ గోదావరి

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 32 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఆర్‌డిఒ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్‌డిఒ

ఉపాధ్యాయ ఎంఎల్‌సి

ఉప ఎన్నిక షురూ

గోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

షేక్ సాబ్జీ మరణంతో అనివార్యమైన ఉప ఎన్నిక

11న నోటిఫికేషన్, 18 వరకూ నామినేషన్ల ప్రక్రియ

డిసెంబర్ 5న పోలింగ్, 9న ఓట్ల లెక్కింపు

గెలుపొందే ఎంఎల్‌సి పదవీ కాలం 2027 మార్చి వరకూ

గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓటర్లు సుమారు 16 వేల మంది

ఆరో తేదీన ఓటర్ల తుదిజాబితా విడుదల

పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో గోపీమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల నగారా మోగింది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సోమవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, 18వ తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ సాగనుంది. 19న పరిశీలన, 21 వరకూ నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. డిసెంబర్ ఐదో తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి నాలుగు గంటల వరకూ పోలింగ్ జరగనుంది. డిసెంబర్ తొమ్మిదో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. రెండు జిల్లాల్లోని దాదాపు 16 వేల మంది ఉపాధ్యాయ ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధమవడంతో ఎన్నికల ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నిక 2021 మార్చిలో జరిగింది. ఆ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన షేక్ సాబ్జీ అఖండ విజయం సాధించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనే విజయకేతనం ఎగురవేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలతోపాటు, ప్రజల సమస్యలపై సాబ్జీ సమర్ధవంతంగా పనిచేశారు. ప్రజల అభిమానం చూరగొని ముందుకు సాగుతున్న తరుణంలో 2023 డిసెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో సాబ్జీ మృతి చెందారు. దీంతో రెండు జిల్లాల్లోని ఉపాధ్యాయ, ఉద్యోగులతోపాటు ప్రజానీకం అంతా తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన అంత్యక్రియలకు వేలాది మంది తరలొచ్చి నివాళులు అర్పించారు. ఎంఎల్‌సి పదవీకాలం ఆరేళ్లు ఉండగా సాబ్జీ దాదాపు రెండున్నరేళ్లు మాత్రమే పదవిలో ఉన్నారు. ఇంకా దాదాపు మూడున్నరేళ్లు పదవీకాలం ఉండటంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు సంబంధించి ఓటర్ల నమోదు, ముసాయిదా జాబితా వంటివి పూర్తి చేసి ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది.

దాదాపు 16 వేల మంది ఉపాధ్యాయ ఓటర్లు

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో జులై 29 నుంచి ఓటుహక్కు నమోదు ప్రారంభించారు. సెప్టెంబర్ మూడో తేదీ వరకూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఓట్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 14,191 మంది దరఖాస్తు చేసుకోగా, పరిశీలన అనంతరం 13,677 మందికి ఓటుహక్కు కల్పించారు. అక్టోబర్ 24న ముసాయిదా జాబితాను ప్రకటించారు. తర్వాత 2,771 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. తుది ఓటర్ల జాబితాను ఈ నెల ఆరో తేదీన ప్రకటించనున్నారు. దాదాపు 16 వేల మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండనున్నట్లు తెలిసింది. 2021లో జరిగిన ఎన్నికల్లో 17 వేల మందికిపైగా ఓటర్లు ఉండగా, ఈసారి ఓటర్ల సంఖ్య తగ్గిన పరిస్థితి నెలకొంది.

ఎన్నికల కోడ్ అమల్లోకి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించడంతో సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎన్నిక పూర్తయ్యే వరకూ కొత్త పనులకు శంకుస్థాపన చేయడం, ప్రారంభోత్సవాలు చేయకూడదు. ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తారో, లేదో వేచిచూడాలి.

పిడిఎఫ్ అభ్యర్థిగా గోపీమూర్తి

2021లో జరిగిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా షేక్ సాబ్జీ గెలుపొందారు. అంతకుముందు రాము సూర్యారావు పిడిఎఫ్ నుంచి గెలుపొందారు. ఈసారి జరుగనున్న ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి బరిలోకి దిగుతున్నారు. ప్రస్తుతం ఆయన రెండు జిల్లాల్లో ఉపాధ్యాయులను, సంఘాల నాయకులను కలిసి మద్దతు కోరు తూ ముందుకు సాగుతున్నారు. అధికారపక్షం కూటమి నుంచిగాని, ప్రతిపక్ష వైసిపి నుంచిగాని అభ్యర్థులను బరిలోకి దింపే అవకాశం ఉండదని తెలుస్తోంది. గెలిచిన అభ్యర్థి పదవీ కాలం 2027 మార్చి వరకూ మాత్రమే ఉండనుంది. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు వెనుకంజ వేస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఉభయగోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానంలో ప్రతిసారీ పిడిఎఫ్ బలం గా పోటీ ఇవ్వడమే కాకుండా విజయకేతనం ఎగురవేస్తోంది. ఒకవేళ పోటీ చేసి నా గెలిచే అవకాశాలు ఉండవనే అభిప్రాయం అధికార, ప్రతిపక్ష నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఇతర అభ్యర్థులు ఎవరైనా బరిలోకి దిగుతారో, లేదో ఒకటి, రెండు రోజుల్లో తెలిసే అవకాశం ఉంది. ఏదేమైనా ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉభయగోదావరి జిల్లాలు పిడిఎఫ్‌కు కంచుకోట అని చెప్పొచ్చు.

ఇదేం చోద్యం..!

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓట్లు నమోదు చేయించాలని అధికారులపై ఒత్తిడి

గతంలో ఈ విధానం లేదని అధికారుల పెదవి విరుపు

జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 30 వేల ఓటర్లు మాత్రమే నమోదు

రేపటితో ముగుస్తున్న తుది గడువు

ప్రజాశక్తి - భీమవరం

పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటర్ల నమోదులో అధికార యంత్రాంగంపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారపక్షమైన కూటమి నుంచి ఎంఎల్‌సి అభ్యర్థిని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ అభ్యర్థిని ఎలాగైనా గెలిపించాలనే తాపత్రయంతో అధికారపక్షం ఆపసోపాలు పడటంతోపాటు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగానికి పూనుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల నమోదుకు అధికారులు వివిధ రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు ఇప్పటికే నిర్వహించారు. వివిధ సంఘాలు, సంస్థలు కూడా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుకు కృషి చేశాయి. అయితే గ్రాడ్యుయేట్లలో నిరాసక్తతో, లేక గడువు పొడిగిస్తారనే భావనోగాని ఓటర్ల నమోదు మందకొడిగా సాగుతోంది. ఈ క్రమంలో అధికారులు వీలైనంత వరకూ రోజువారీ కార్యక్రమాలతోపాటు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల నమోదుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే కూటమి నేతలు మాత్రం క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్లను గుర్తించి వారి ఓట్ల నమోదుకు ప్రయత్నించకుండా అధికార యంత్రాంగం ద్వారా ఓట్ల నమోదుకు ప్రయత్నిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. దీనిపై ఏలూరు జిల్లాలో చింతలపూడి, కైకలూరు తదితర నియోజకవర్గాల్లో అధికారపక్షమైన కూటమి నిర్వహించిన సదస్సుల్లో అధికారులు పాల్గొనడం, ఎంఎల్‌ఎల ఇళ్లకు దరఖాస్తులు తీసుకుని రావాలని ఉపాధ్యాయులకు ఎంఇఒలు ఆదేశాలివ్వడంపై కలెక్టర్‌కు సైతం ప్రజాసంఘాలు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అదే తరహాలో కాకపోయినా పశ్చిమగోదావరి జిల్లాలోనూ కూటమి నేతలు మండల అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. బిఎల్‌ఒలు, విఆర్‌ఒలకు స్పష్టమైన ఆదేశాలిచ్చి గ్రామస్థాయిలో డిగ్రీ పూర్తి చేసిన వారిని గుర్తించాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా కేవలం 30 వేల మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యారు. ఈ నెల ఆరో తేదీ బుధవారంతో ఓట్ల నమోదు గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నడూ లేనంతగా కూటమి నేతలు అధికారులపై ఒత్తిడి పెంచి ఓట్ల నమోదు ప్రక్రియకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి తరపున పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ పేరును ఖరారు చేసి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో పట్టభద్రులు మాత్రమే ఓటర్లుగా ఉంటారు. వారికి ఓటర్లుగా నమోదుకు ఎన్నికల సంఘం పలు దఫాలుగా గడువు నిర్ణయించి ప్రకటించింది. అయితే ఆ దిశగా పట్టభద్రులు పెద్దగా ఓట్ల నమోదుకు ముందుకు రాలేదు. కూటమి నేతలు తొలుత దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. తీరా అభ్యర్థిని ప్రకటించాక ప్రయత్నం చేసి హైరానా పడ్డా సమన్వయ లోపంతో నమోదు ప్రక్రియ మందకొడిగానే సాగింది. ఈ నెల రెండో తేదీన భీమవరంలో జరిగిన కూటమి ఆత్మీయ సదస్సులో ఎంఎల్‌సి అభ్యర్థి రాజశేఖర్ ఓట్ల నమోదుపై ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గస్థాయిలో ఆశించిన మేర ఓటర్ల నమోదు ప్రక్రియ సాగలేదని, తహశీల్దార్లు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు సంతకాలకు అనేక ఇబ్బందులు పెడుతున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి రవికుమార్‌తోపాటు జిల్లాకు చెందిన మరో మంత్రి నిమ్మల రామానాయుడు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్ల నమోదు చాలా కీలకమని, నియోజకవర్గాల్లో ఎంఎల్‌ఎలు బాధ్యత తీసుకుని నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇవే ఆదేశాలను జిల్లా కలెక్టరేట్లో జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులకు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియను జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదుపై సంబంధీకులకు అవగాహన కల్పించాలని, ఓట్ల నమోదుకు కృషి చేయాలని కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో తహశీల్దార్లు మండల అధికారులకు, గ్రామాధికారులకు ఈ రెండు రోజులు ఈ పనిపై దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల నమోదును ఎవరూ తప్పుబట్టాల్సిన అవసరం లేదు. తప్పుబట్టరు కూడా. అయితే ఉద్యోగులుగా ఉన్న ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇదంతా కూటమి నేతల ఒత్తిడి ఫలితమేననే విమర్శలు విన్పిస్తున్నాయి. గతంలో ఈ విధానం లేదని కొందరు అధికారులు పెదవి విరుస్తుండటం గమనార్హం. గతంలో ఎవరికి ఇష్టముంటే వారు ఓటర్లుగా నమోదయ్యేవారని, ఇప్పుడు కచ్చితంగా నమోదు కావాలని బలవంతం చేయడం సరికాదని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఓటర్ల నమోదులోనే ఇన్ని ఒత్తిళ్లుంటే ఇక ఎన్నికల్లో అధికారపక్షం ఎన్ని అడ్డదారులు తొక్కుతుందోనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేసుకునేలా ఒత్తిడి కాకుండా అవగాహన కల్పించడంపై దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు.

రేపటితో గడువు పూర్తి

ఈ నెల ఆరో తేదీతో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు తుది గడువు పూర్తి కానుంది. అయితే ఇప్పటి వరకు కేవలం 30 వేల మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యారు. గత ఎన్నికలతో పోలిస్తే ఇది బాగా తక్కువ. కేవలం 40 నుంచి 45 శాతం మంది మాత్రమే ఓటర్లు నమోదైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తుదిగడువు సమీపించడంతో కూటమి నేతలు, అటు అధికార యంత్రాంగం ఓటర్ల నమోదులో తలమునకలయ్యారు.

ఒత్తిడితో అధికారుల్లో ఆందోళన

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో ఉద్యోగులు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేయడంపై అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే ఓటు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలో దరఖాస్తులను అందజేయాలనే నిబంధన ఉంది. అయితే అధికారులు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అప్పగించిన సవాలక్ష పనులతో సతమతమవుతున్న ఉద్యోగులకు ఓటరు నమోదు తలకు మించిన భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో కూటమి నేతల తీరు ఎలాగుంటుందోననే ఆందోళన ఉద్యోగుల్లో ఎక్కువ కన్పిస్తోంది.

ఇళ్ల తొలగింపును నిరసిస్తూ బైఠాయించిన బాధితులు, సిపిఎం నేతలు

ఐ భీమవరంలో ఇళ్ల తొలగింపునకు యత్నం

అడ్డుకున్న బాధితులు, సిపిఎం నేతలు

ఉద్రిక్తత, తోపులాట, సొమ్మసిల్లిన యువతి

ఇళ్లకు కరెంటు తొలగించిన అధికారులు

ప్రజాశక్తి - ఆకివీడు

వారంతా నిరుపేదలు. ఆ గ్రామంలో రోడ్డు పక్క ఖాళీ స్థలాల్లో ఇళ్లు వేసుకుని చాలాకాలంగా జీవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆ రోడ్డు విస్తరణకు కసరత్తు ప్రారంభించారు. దీంతో ఇళ్ల తొలగింపునకు అధికారులు నివాసితులకు నోటీసులిచ్చారు. అయితే తమకు పట్టాలిచ్చి స్థలాలు చూపిన చోట్ల మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఇళ్లు ఖాళీ చేయడానికి తాము వ్యతిరేకం కాదని, కావున మౌలిక వసతులు కల్పించాలని, మూడు నెలల గడువు ఇవ్వాలని సుమారు నెల రోజులుగా నివాసితులంతా ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజుతోపాటు అధికారులను సైతం పలు దఫాలుగా కలిసి వేడుకున్నారు. సదుపాయాలు కల్పిస్తామని, అయితే మూడు నెలల సమయం సాధ్యం కాదంటూ అధికారుల మరోసారి హెచ్చరించి సోమవారం ఉదయం ఇళ్ల తొలగింపు పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటికే ఖాళీ చేసిన ఇళ్లను తొలగించారు. ఆకివీడు మార్గంలో ఉన్న ఇళ్ల వద్దకు వచ్చేసరికి నివాసితులు తమకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. అయితే సాధ్యం కాదని చెప్పిన అధికారులు బలవంతంగా జెసిబితో ఇళ్ల తొలగింపునకు సిద్ధ పడ్డారు. దీంతో నివాసితులతోపాటు అక్కడికి చేరుకున్న సిపిఎం నేతలు తొలగింపు యత్నాలను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. దీనిపై చాలాసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో పోలీసులు రంగంలోకి దిగి రోడ్డుపై బైఠాయించిన వారిని తొలగించే ప్రయత్నం చేశారు. దీన్ని గ్రామస్తులు తీవ్రంగా ప్రతిఘటించడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో తులసి అనే మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో పోలీసులు అప్రమత్తమై వెంటనే ఆమెను పోలీసు వాహనంలోనే ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. యువతి క్షేమంగా ఉందని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు, సిఐ వి.జగదీశ్వరరావు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఇరుపక్షాల నడుమ వాదోపవాదాలు సాగాయి. అయితే కొద్దిసేపటికి అధికారులు వెనుదిరిగారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉన్న ఇళ్లకు కరెంటు కనెక్షన్లను విద్యుత్ శాఖాధికారులు తొలగించారు. ఈ విషయం తెలియగానే బాధిత ప్రజలంతా బైఠాయించిన ప్రాంతం నుంచి ర్యాలీగా విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనల్లో సిపిఎం మండల కార్యదర్శి కె.తవిటినాయుడు, నేతలు పెంకె అప్పారావు, సందక ఉదయ కుమారి, గేదెల ధనుష్, డోకల రవితేజ, బివి.వర్మ, సందక సూరిబాబు, బొడ్డుపల్లి రాంబాబు, గేదెల లావణ్య, గ్రామస్తులు నెల్లి సూరిబాబు, సారేపల్లి అప్పన్న, శనపతి శీను, మీసాల కుమారి, ఎల్ లక్ష్మి, ఖండాపు వజ్రం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను కూల్చుతున్న పొక్లెయిన్

సొమ్మసిల్లిన యువతిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

పేదల ఇళ్ల తొలగింపు అన్యాయం

సిపిఎం జిల్లా కమిటీ ఖండన

భీమవరం: ఐ.భీమవరం రోడ్డులో దశాబ్దాలుగా రోడ్డుపక్కనే నివాసం ఉంటున్న పేదల ఇళ్లను ఎంఎల్‌ఎ ఆదేశాలతో అక్రమంగా కూల్చివేయడం దారుణమని సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ కమిటీ కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని చెప్పుకుంటుంటే ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు పేదల నివాసాలపైనే యుద్ధం చేయడం దారుణమన్నారు. ఖాళీ చేయడానికి కొంత సమయం ఇవ్వాలని ఎంఎల్‌ఎను బాధితులు ప్రాధేయపడి వేడుకుంటున్నా కనికరించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంఎల్‌ఎ ఆదేశాలతో అధికారులు, పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించడం, పేదలకు అండగా ఉన్న సిపిఎం నేతలను గృహనిర్బంధాలు, బాధితులపై దౌర్జన్యం, బెదిరింపులు, హెచ్చరికలు దారుణమని పేర్కొన్నారు. ఎంఎల్‌ఎ, ప్రభుత్వ దాడిని అందరూ ఖండించాలని, పేదలకు అండగా నిలవాలని కోరారు. కూల్చిన ఇళ్లకు నష్టపరిహారం, స్థలాలు, ఇళ్ల నిర్మాణం, ఉపాధి చూపాలని బలరాం డిమాండ్ చేశారు. పేదలపై యుద్ధం కాదని, బడాబాబుల అక్రమాలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

తమ సమస్య లను తక్షణం పరిష్కరించాలని కోరు తూ గ్రామ రెవెన్యూ సహాయ కులు (విఆర్‌ఎలు) సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. వేతనాలు పెంచాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, నైట్‌వాచ్‌మెన్, అటెండర్ పనులను విఆర్‌ఎలతో చేయించరాదని నినదించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం విఆర్‌ఎల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఈ ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరిస్తుందని ఆశతో ఉన్నామని తెలిపారు. విఆర్‌ఎలు చాలీచాలని వేతనాలతో కాలం గడుపుతున్నారని, ప్రభుత్వాలు మారుతున్నా, ధరలు ఆకాశాన్నంటుతున్నా తమ వేతనాలు పెరగడం లేదన్నారు. తక్షణమే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ విఆర్‌ఎల సమస్యలు వినే ప్రయత్నం కూడా గత ప్రభుత్వం చేయలేదని, పైగా విఆర్‌ఎలకు ఏ పనీ లేదని తప్పుడు ప్రచారం చేసిందని విమర్శించారు. అటెండర్, నైట్ వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేసి విఆర్‌ఎలపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్, రావూరి మాణిక్యాలరావు, భాషా, కాశీ, ఆకుల పాండురంగారావు, కీర్తి అచ్చయ్య, శిరీష, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నినదిస్తున్న విఆర్‌ఎలు

ఉపాధి వేతన బకాయిలు చెల్లించండి

వ్యకాస ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

పెనుగొండ: ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆరుగాలం కష్టపడి ఉపాధి పనిచేస్తున్న కూలీలకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని అన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ వడలి గ్రామంలో ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించటంలో ఫీల్డ్ అసిస్టెంట్ సునీత కూలీ చెల్లింపులు తగ్గించి వేస్తున్నారన్నారు. ఈమేరకు తహశీల్దార్ బి.అనిత కుమారికి వినతిపత్రం అందజేశారు. ఉపాధి పని చేయని ఇతరులకు మస్తరు వేసి వారి బ్యాంక్ ఖాతాల్లోకి కూలీల డబ్బును అక్రమంగా తరలిస్తున్నారన్నారు. రావలసిన వేతనాల కంటే తగ్గించి వస్తున్నాయని, కార్మికులు అడిగిన సందర్భంలో అంతే వస్తాయని, మీ దిక్కున్న చోట చెప్పుకోండి అని కార్మికులను బెదిరిస్తున్నారన్నారు. ఇద్దరు కూలీలకు కలిపి ఇవ్వాల్సిన పనికొలతలు రెట్టింపు చేసి ఇచ్చి పని చేయమంటున్నారని కార్మికులు వాపోతున్నారు. అదనపు కొలతల పనినే పనికిరాని ఇతరుల పనిగా చూపిస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని విమర్శించారు. 2023వ సంవత్సరంలో వడలి కాలువలో చేసిన పని వేతనాలు అడిగితే మీరు మర్చిపోండి అని, లేకపోతే పనులకు పిలువనని హెచ్చరికలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు గంగారావు, ఆదినారాయణ, కార్మికులు కామన వరలక్ష్మి పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యకాస నేతలు

నేర రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

ఉండి: ఉండి నియోజకవర్గాన్ని నేర రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడ మే తమ లక్ష్యమని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. సోమ వారం ఉండి రైతు సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన పోలీస్ స్టేషన్‌ను కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి ప్రారంభించారు. ముఖ్యఅతిథి రఘురామకృష్ణంరాజు పాల్గొని మాట్లాడుతూ నేర రహిత నియోజకవర్గంగా చేయటానికి కావలసిన చర్యలన్నీ కలెక్టర్, ఎస్‌పి సహకారంతో చేపడతానన్నారు. ప్రభుత్వ పనితీరుకు లాఅండ్ ఆర్డర్ చాలా ముఖ్యమన్నారు. ప్రజలు సంతోషంగా, ధైర్యంగా ఉండాలంటే ధైర్యాన్ని ఇచ్చేవారు పోలీసులు అని కొనియాడారు. ఉండిలో గత 20 సంవత్సరాలుగా పోలీస్ స్టేషన్ లేక ఇబ్బందిపడుతూ వెలుగు కార్యాలయ భవనంలో, ఇరుకు గదులలో పోలీసులు కార్యకలాపాలు కొనసాగించడంతో జిల్లా ఎస్‌పి, కలెక్టర్‌తో చర్చించి ఈ భవనంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు యడవిల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ, పక్కనే కలెక్టర్, ఎస్‌పి

కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించాలి

కౌలురైతు, రైతు సంఘం ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో కౌలురైతులకు ఓటుహక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పంటరుణాలు కౌలురైతులకే ఇవ్వాలని, ప్రస్తుత ఖరీఫ్‌లో పంటనష్టపోయిన రైతులకు పంటనష్టం వెంటనే ఇవ్వాలని, ధాన్యం కొనుగోలులో అక్రమాలు అరికట్టి గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. ఈమేరకు స్థానిక కలెక్టరేట్‌లో సంఘాల నేతలు కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం అంతా కౌలురైతులే సాగు చేస్తున్నారని, భూస్వాములు, భూయజమానులు వ్యవసాయంలో లేరన్నారు. సాగునీరు అవసరాలు, ఎద్దడి, కాలువల పూడికతీత వంటి విషయాలు వ్యవసాయంలో ఉన్నవారికే తెలుస్తాయన్నారు. ప్రభుత్వం బ్యాంకర్లతో ఎన్ని సమావేశాలు పెట్టినా కౌలురైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ పంట మొదటిదశలో పంటనష్టపోయిన రైతాంగానికి పంటనష్టం ఇంతవరకు ఇవ్వలేదని, వెనకాల దెబ్బతిన్న రైతులకు పరిహారం ఇచ్చి, వీరికి ఇవ్వకపోవడం దారుణమన్నారు. జిల్లాలో 13 మండలాల్లో 10 వేల 600 ఎకరాల్లో పంటదెబ్బతిన్నదని, 9 వేల మంది పైబడి రూ.9 కోట్ల 40 వేల వరకు పంటనష్ట పరిహారం ఇవ్వాలన్నారు. పంట మాసూలు ముందుకు వస్తున్న దశలో ధాన్యం కొనుగోలులో తేమశాతం, తరుగు శాతం, నూక శాతం వంటి మోసాలను అరికట్టి, పూర్తిస్థాయిలో గోనెసంచులు అందుబాటులో ఉంచాలని, రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల్లో కౌలురైతులకు ఓటుహక్కు కల్పిస్తామన్నారని, కౌలురైతుల పంట రుణాల విషయంపై జిల్లా లీడ్ బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణం కౌలురైతులకు పంటరుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో కౌలురైతులు కేతా మోహనరావు, బండి శ్రీనివాసు, కుడిపూడి విష్ణుమూర్తి, కడలి సత్యనారాయణ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న కౌలు, రైతు సంఘం నేతలు

ఎంఎల్‌ఎ హాజరు.. కూటమి కౌన్సిలర్లు గైర్హాజరు

ఆకివీడు నగర పంచాయతీలో కూటమి కౌన్సిలర్ల తీరుపై గుసగుసలు

పజాశక్తి - ఆకివీడు

ఎన్నడూ లేని విధంగా నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం కూటమి సభ్యులు లేకుండా వైసిపి సభ్యులతో ముగిసింది. సోమవారం పాలకవర్గ సమావేశం చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. ప్రత్యేక సభ్యులు, ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అయితే టిడిపి సభ్యులు గాని, వారి మిత్రపక్షమైన జనసేనకు చెందిన కౌన్సిలర్లు గాని ఈ సమావేశంలో పాల్గొనలేదు. ముందుగా సభ్యులకు పంపిణీ చేసిన అజెండా నోటీసులో మున్సిపల్ అధికారులు స్పష్టంగా సమావేశంలో ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు పాల్గొంటున్నట్లు తెలిపారు. పనిగట్టుకుని మొత్తం ఎనిమిది మంది సభ్యులు ఒకేసారి మానేయడం వెనుక అనేక గుసగుసలు వినిపిస్తున్నాయి. నగర పంచాయతీలో ఉన్న నిధులు ఖర్చుకి రెండు పార్టీల అభ్యర్థులకు ఆయా వార్డులకు సమానంగా పంచినట్లు తెలుస్తోంది. అయితే తాము అధికారంలో ఉన్నందువల్ల తమకే హెచ్చు భాగం కావాలని కూటమి సభ్యులు కోరినట్లు వినికిడి. మరోపక్క ఎంఎల్‌ఎకి వ్యతిరేకమా, నిధుల కోసమా కారణం ఏమిటి అన్నది చర్చ తీవ్రంగా జరుగుతోంది. పార్టీ నాయకుడు హాజరైనా.. కౌన్సిలర్లు హాజరు కాకపోవటం పట్టణంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మొక్కలు నాటిన జెసిఐ విద్యార్థులు

ప్రజాశక్తి – పాలకొల్లు

జెసిఐ పాలకొల్లు ఆధ్వర్యంలో మాంటిస్సోరి స్కూల్ లజపతిరాయ్ పేటలో పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కెబి.కృష్ణవర్మ మాట్లాడుతూ మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా, ప్రీప్రైమరీ విద్యార్థులు మొక్కలు, పూల వేషధారణ దుస్తులలో పాల్గొని ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో జెసిఐ కోఆర్డినేటర్ కౌషిక్, ప్రిన్సిపల్ ఎస్ఎస్‌వి.ప్రకాశరావు, ఇన్‌ఛార్జి బి.శ్రీదేవి, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

కార్తీకమాస అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలు

కాళ్లకూరులో కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి – కాళ్ల

కార్తీకమాసంలో నిర్వహించే కార్తీక వన సమారాధన కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు పేర్కొన్నారు. కాళ్లకూరు గ్రామంలో పార్వతీసమేత భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా దాట్ల వెంకట రామరాజు ఆర్థిక సాయంతో దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న సమారాధన సోమవారం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు విచ్చేశారు. మొదటి సోమవారం దాట్ల వెంకటరామరాజు ఆర్థిక సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. ఇంకా మూడు సోమవారాలు దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అడ్డాల నాగరాజు, చేకూరి పుల్లంరాజు పాల్గొన్నారు.

గణితం పట్ల అభిరుచిని పెంపొందించుకోవాలి

ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి – భీమవరం రూరల్

అన్నాకోడేరు, డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యూమన్ కంప్యూటర్‌గా ప్రసిద్ధిగాంచిన శకుంతలా దేవి జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు 'హ్యూమన్ కంప్యూటర్ శకుంతలా దేవి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి గణిత పట్ల శ్రద్ధ వహించాలని, గణిత పట్ల అభిరుచిని పెంపొందించుకోవాలని, ఉపాధ్యాయులు గణితాన్ని బోధించేటప్పుడు శ్రద్ధగా వినాలని సూచించారు. వ్యాసరచన పోటీలో విజేతలకు గణిత ఉపాధ్యాయులు రేపాక వెంకట్రావు సౌజన్యంతో గణితానికి సంబంధించిన పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7న చలో విజయవాడ

మెడికల్ రిప్రజెంటేటివ్స్ రాష్ట్ర కార్యదర్శి శిరీష్ కుమార్

భీమవరంలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి – భీమవరం

మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన చలో విజయవాడ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.శిరీష్ కుమార్ తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో చలో విజయవాడకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌లకి వర్తించే సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టం (1976)ని అమలు చేయాలన్నారు. సేవ, ఒత్తిడితో ఇటీవల కాలంలో మెడికల్ రిప్‌లు మరణిస్తున్నారని, అలాంటి ఫార్మా యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న 4 లేబర్ కోడ్‌లు వెనక్కి తీసుకోవాలని, కార్మికచట్టాలను అమలు చేయాలన్నారు. ఒత్తిడిచేసే యాజమాన్యాలపై కఠినమైన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేజ్ బోర్డ్ (వేతన కమిటీ)ని నియమించి మెడికల్ రిప్‌కు నెలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, అలాగే హైలీ పెయిడ్ కేటగిరీలకి గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ 7న జరగబోయే సభలో విజయవాడ ధర్నాకి పెద్ద ఎత్తున మెడికల్ రిప్ రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె.సూర్యచంద్రరావు, కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ఎఇ శ్రీనివాస్‌కు సంజాయిషీ నోటీసు

ప్రజాశక్తి – పాలకొల్లు

నరసాపురం ఇరిగేషన్ సబ్ డివిజన్ సిద్ధాంతం సెక్షన్‌లో పనిచేస్తున్న ఎఇ కె.శ్రీనివాస్‌కు సంబంధిత ఉన్నతాధికారి సోమవారం సంజాయిషీ నోటీస్ ఇచ్చారు. ఆదివారం పోడూరు మండలం వద్దిపర్రు వెళ్లిన మంత్రి రామానాయుడుకు వరి చేలకు నీరందక ఇబ్బందులు పడుతున్నామని ఎఇ వ్యవహారంపై రైతులు మంత్రికి ఫిర్యాదు చేశారు. రైతులకు సాగు నీరందించడం, నీటి విడుదల సక్రమ నిర్వహణ, తూడు తొలగింపు విషయంలో ఎఇ అలసత్వంపై మంత్రి ప్రశ్నించారు. రైతాంగ పంటకు సాగునీరు అందడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎఇపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో కోరుతూ సంజాయిషీ ఇవ్వాలని నోటీసు జారీ చేశారు. సాగునీరు అందడంలో ఏ అధికారి నిర్లక్ష్యం వహించినా కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి రామానాయుడు హెచ్చరించారు.

పక్కాడ్రెయిన్లు నిర్మించాలని ఆందోళన

ప్రజాశక్తి – మొగల్తూరు

మొగల్తూరు ఆదర్శనగర్‌లో పక్కాడ్రెయిన్లు నిర్మించాలని కోరుతూ ఆ కాలనీ వాసులు సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. సిపిఎం నాయకులు యడ్ల చిట్టిబాబు ఆధ్వర్యంలో కాలనీ నుంచి ప్రదర్శనగా పంచాయతీ కార్యాలయానికి చేరుకుని అక్కడ నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కార్యదర్శి ముచ్చర్ల చిన్నకు వినతిపత్రం అందించారు.

ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి – పాలకొల్లు

స్వచ్ఛ సేవా భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బిజెపి కాకినాడ పార్లమెంట్ ఇన్‌ఛార్జి రావూరి సువ పుట్టినరోజు సందర్భంగా స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరంకు విశేష స్పందన వచ్చింది. ముఖ్యఅతిథిగా కేంద్ర భారీ పరిశ్రమలు, గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. మంత్రి వర్మ సువకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా సువ పుట్టినరోజు వేడుకలను ఆర్భాటంగా కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు.

నేరాలు – ఘోరాలు

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి – నరసాపురం

కుటుంబ కలహాలతో కొప్పర్రు బుద్ధిమానిపేటకు చెందిన తోకల రాజేష్(27) అనే యువకుడు పురుగుమందు తాగి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం రాజేష్ ఈనెల 3వ తేదీ తెల్లవారు జామున ఇంటి నుంచి బయటకు వెళ్లి కలుపు మందు తాగాడు. భీమవరం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడన్నారు. మృతుని తల్లి గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరసాపురం రూరల్ ఎస్ఐ టివి.సురేష్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814


అవార్డు అందుకుంటున్న సంపత్‌రావు

జాతీయ సేవా అవార్డుతో మరింత బాధ్యత

అవార్డు గ్రహీత సంపత్‌రావు

ప్రజాశక్తి – పెనుమంట్ర

ఆరిగపూడి ఫౌండేషన్ విశిష్ట సేవా జాతీయ పురస్కారం సమాజం పట్ల బాధ్యత మరింత పెంచిందని పురస్కార గ్రహీత తాడిపర్తి సంపత్ రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి.రజని, జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఐఆర్ఎస్ అధికారి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.నరసింహారావు, తెలంగాణా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎన్.శంకరం, ఆంధ్రప్రభ సంపాదకులు వైఎస్ఆర్.శర్మ, అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ విజయ కుమార్, డాక్టర్ బి.కృష్ణ, తదితర ప్రముఖుల సమక్షంలో విశిష్ట సేవా జాతీయ పురస్కారం ప్రదానం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ మేడపాటి సత్యప్రకాష్, అమరావతి సచివాలయం గణాంక శాఖ జాయింట్ సెక్రటరీ దిడ్డే శ్రీనివాసరావు, పాలమూరు గ్రామ సర్పంచి కాకర రాజేశ్వరరావు, స్థానిక ఎంపిటిసిలు నాగదుర్గ, నరసింహమూర్తి, సమత ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యులు ఆయన్ని అభినందించారు.


ఎంఎల్ఎ అంజిబాబుకు నగదు అందజేస్తున్న పళ్ల ఏసుబాబు

దాతల సహాయం అభినందనీయం

ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి – భీమవరం టౌన్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించడం అభినందనీయమని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. తారకరామా కన్‌స్ట్రక్షన్ ఛైర్మన్, విస్సాకోడేరు లే అవుట్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహనిర్మాణ పథకం కాంట్రాక్టర్ పళ్ల ఏసుబాబు, వైస్ ఛైర్మన్ తారక రామ్‌లు ఎంఎల్ఎ నివాసం వద్ద సోమవారం విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షల విరాళాన్ని ఎంఎల్ఎ అంజిబాబుకు అందించారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ఇప్పటివరకూ దాతల నుంచి రూ.1,01,40,200(కోటి లక్ష నలభై వేల రెండు వందల రూపాయలు) విరాళాల రూపంలో వచ్చాయని దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వడ్డి సుబ్బారావు, జంపన ఫణిబాబు, కారుమూరి సత్యనారాయణమూర్తి, చింతలపాటి బంగారాజు, ఆకుల కృష్ణ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై ప్రేరణ అంశంపై అవగాహన

ప్రజాశక్తి – నరసాపురం

స్థానిక శ్రీవైఎన్ కళాశాల ఆవిష్కరణలు, వ్యవస్థాపక అభివృద్ధి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై ప్రేరణ అనే అంశంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు రిసోర్స్ పర్సన్‌గా రాహుల్ జైన్ విచ్చేసి మాట్లాడుతూ వ్యాపారం ఎలా ప్రారంభించాలి, దానికి కావలసిన అంశాలేంటి, పెట్టుబడి ఎలా చూసుకోవాలి, మన నైపుణ్యం, మెళకువలను బట్టి వ్యాపారాన్ని ఎలా ఎంచుకోవాలి, అదేవిధంగా మనం ప్రారంభిస్తున్న వ్యాపారానికి సంబంధించిన అనుభవం సంపాదించడం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, వ్యవస్థాపక అభివృద్ధి కేంద్రం సమన్వయకర్త పుప్పాల వీరాస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంక్ వద్ద క్యూ కట్టిన జనం

ఆధార్‌లో మార్పులు, చేర్పులకు ప్రజల అవస్థలు

యూనియన్ బ్యాంక్ వద్ద క్యూలో పాట్లు

ప్రజాశక్తి – నరసాపురం

నరసాపురం పట్టణంలో సోమవారం ఆధార్ కార్డులో చేర్పులు, మార్పుల కోసం ప్రజలు యూనియన్ బ్యాంక్ వద్ద క్యూ కట్టారు. ఇటీవల దీపం–2, తల్లికి వందనం వంటి ప్రభుత్వ పథకాలకు ఆధార్ కార్డు మొబైల్ నెంబర్ లింకు కావడం, ఆధార్ కార్డులో పేర్లు మార్చుకునేందుకు, ఆధార్‌కార్డ్ నవీకరణ చేసుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు తాళాలు తీయకముందే వేకువ జాము నుంచే క్యూ లైన్లో నిలబడుతున్నారు. ఇటీవల మండలం, పట్టణంలో ఆధార్ క్యాంప్‌లు నిర్వహించారు. పెద్దగా ప్రచారం చేయకపోవడంతో ఆధార్ క్యాంప్ నిర్వహించాలని సైతం ప్రజలకు తెలియలేదు. ప్రభుత్వం స్పందించి ఆధార్ కార్డ్ క్యాంపులు నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

శ్మశాన వాటిక కోసం కలెక్టర్‌కు వినతి

పెనుమంట్ర : మండలంలోని మాల మహానాడు అధ్యక్షుడు కుసుము వెంకటేశ్వరరావు ఆలమూరు శ్మశాన వాటిక కోసం సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు వినతి పత్రాలు పరిశీలించి గత 100 సంవత్సరాలుగా ఆలమురు గ్రామ ప్రజలకు, దళితులకు శ్మశాన వాటిక లేనందున సదరు ఓడూరు గ్రామం నక్కల పుంత బోధి పక్కన ఖననం చేస్తున్నారన్నారు. కొన్ని కారణాల వల్ల ఓడూరు వారు డంపింగ్ యార్డ్ చేసి అక్కడ ఖననం చేసుకోకుండా చేస్తున్నారని తెలిపారు. గత పది సంవత్సరాల నుంచి తహశీల్దార్, కలెక్టర్, ఆర్‌డిఒకి వినతి పత్రాలు అందజేస్తున్నా ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. గత సంవత్సరం అక్టోబర్ 24వ తేదీన ఆలమూరు అంబేద్కర్ సెంటర్లో ధర్నా కూడా చేశామని, ఆ సమయంలో ఆర్‌డిఒ వచ్చి ఈ సమస్యను పరిష్కరించాలని, ఎక్కడైనా రెండు ఎకరాల భూమి ఇప్పిస్తామని హామీ ఇచ్చి ఉన్నారన్నారు. సదరు ఓడూరులో నక్కల పుంతలో శ్మశాన వాటికను శుభ్రం చేయించి కర్రలు పాతి బరకం కట్టారన్నారు. తమకు శ్మశాన వాటిక కల్పించాలని కోరతూ కలెక్టర్‌కు వినతిని అందజేసినట్లు తెలిపారు. ఆలమూరు ఎస్‌సి మాల, మాదిగ సభ్యులందరూ వినతి పత్రం మీద సంతకం చేసి కలెక్టర్‌కి ఇవ్వటం జరిగిందని, ఈ సమస్య మీద అధికారులు పరిశీలించి శ్మశాన వాటిక ఇచ్చేవరకు, ఆ స్మశాన వాటికకి కంచె వేయించి ,చుట్టూ ఫినిషింగ్ వేసి, అక్కడ పందుల గుడిసెలను తొలగించమని ఆలమూరు దళిత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు.

సమస్యల వలయంలో కోడిపందేల దిబ్బ

కనీస మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసుల ఆవేదన

సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, వినతి

ప్రజాశక్తి – పెనుగొండ

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

మేజర్ పంచాయతీ పెనుగొండ చివరి కోడిపందేల దిబ్బ కాలనీలో రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో మండలాభివృద్ధి అధికారి సూర్యనారాయణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకురాలు గుడాల వాణి మాట్లాడుతూ గ్రామపంచాయతీ వారు వీధిలైట్లు వేసినా ఇంతవరకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదని, రోడ్లు మునిగి కాలనీ రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నామని పలుసార్లు తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్డుపై గుంతలు పూడ్చాలని, కనీసం తాగునీరు కాలనీవాసులకు సక్రమంగా అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూవారి పనులకు వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. తాగునీరు కోసం రోజంతా పడిగాపులు కాస్తున్నామని, పై సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి లక్ష్మి, చింతపల్లి పద్మ, శకుంతల, జ్యోతి, సిపిఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, పాదుషా, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆరుగొలను గ్రామాన్ని దోచుకుంది ఆయనే

కాదని చెప్తే రాజీనామా చేస్తా

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

ఆరుగొలను గ్రామాన్ని దోచుకుంది కొట్టు సత్యనారాయణ అని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో రూ.37.50 లక్షలతో 900 మీటర్ల మేర నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరుగొలను గ్రామంలోని లారీ, మిషన్, క్వారీ ఓనర్లను బ్లాక్ మెయిల్ చేసి కోట్ల రూపాయలు బిల్లు చేసుకున్న వ్యక్తి కొట్టు సత్యనారాయణ అని ఆరోపించారు. గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని లారీ, మిషన్, క్వారీ ఓనర్లకు తాను సూచించానని, కాదని నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. అభివృద్ధిపై తాము పనిచేస్తామన్నారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు పారిపోతే వారిని తీసుకొచ్చి పని చేస్తున్నామన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. గ్రామ అభివృద్ధికి రూ.11 కోట్లు తీసుకొచ్చినట్లు చెబుతున్నావని, గ్రామంలో గుంతలు ఎందుకు పూడ్చలేదని ప్రశ్నించారు. స్థాయి దిగి మాట్లాడటం తనకు అలవాటు లేదని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణను ఉద్దేశించి పేర్కొన్నారు. ప్రజల అభీష్టం మేరకు పార్టీలకతీతంగా తాము పని చేస్తామన్నారు. వర్గాలను తీసుకొస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే రూ.6 కోట్లతో వివిధ పనులు చేస్తున్నామని, వచ్చే ఏడాది మరో రూ.10 కోట్లతో పనిచేస్తామన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకున్నానని తెలిపారు. ఆరుగొలను సర్పంచి బుచ్చిబాబు, జనసేన నాయకులు అడపా ప్రసాద్, బైనపాలేపు ముఖేష్ పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న బొలిశెట్టి

టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు

మౌలిక సదుపాయాలు కల్పించి.. గృహాలు అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి – భీమవరం

భీమవరం పట్టణంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఇప్పటి వరకూ లబ్ధిదారులకు అందించకపోవడంతో 6,300 మంది ఇళ్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. తక్షణం మౌలిక వసతులు కల్పించి గృహాలు అందించాలని డిమాండ్ చేశారు. స్థానిక వెంటే వారి తోటలోని సుందరయ్య భవనంలో సిపిఎం భీమవరం పట్టణ కమిటీ సమీక్ష సమావేశం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు రూ.లక్ష అప్పు చేసి, ప్రభుత్వానికి కట్టి, పదేళ్లు దాటినా ఇంతవరకు పూర్తిగా లబ్ధిదారులకు అందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పేదవాడి సొంత ఇంటి కల నెరవేరలేదన్నారు. ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇంటి అద్దెలు చెల్లించలేక, పెరుగుతున్న నిత్యవసర ధరల భారం మోయలేక సామాన్యులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం గతంలో పెద్ద ఎత్తున పోరాడిన ఫలితంగా 2 వేల మందికి ఇల్లు మంజూరు చేశారని, ఇంకా 6,300 మంది లబ్ధిదారులు ఇంటి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పైపుల చెరువు వద్ద 3 వేల మందికి స్థలాలు ఇచ్చారని, ఇంతవరకూ ఇల్లు నిర్మాణం చేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పూర్తి కాలేదని, వాటిని ప్రభుత్వమే నిధులు మంజూరు చేసి త్వరగా పూర్తిచేసి, లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భీమవరంలో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో చెత్త ఎక్కడపడితే అక్కడ వేయటం వల్ల దోమలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాత బస్టాండ్‌లో అల్లూరి సీతారామరాజు మెమోరియల్ పడగొట్టి ఎనిమిదేళ్లు అయినా ఇంతవరకూ అల్లూరి సీతారామరాజు మెమోరియల్ నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, పట్టణ నాయకులు డి.నాగు, కె.కృష్ణ, బి.వరలక్ష్మి, బి.అప్పన్న పాల్గొన్నారు.

ఆరోగ్యమే సమాజాభివృద్ధికి మూలం

ఎపి నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్ కుమార్

తాడేపల్లిగూడెం : ఆరోగ్యమే సమాజాభివృద్ధికి మూలమని ఎపి నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్ కుమార్ తెలిపారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్ జాతీయ ఐక్యతా దినోత్సవంను పురస్కరించుకొని వాకథాన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ వీరేష్ కుమార్ మాట్లాడుతూ ఉక్కుమనిషి, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ప్రతి విద్యార్థి పటేల్ ఆశయ సాధనకు కృషిచేయాలని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం దేశాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. ఐక్యతా నడక మన ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్య భారతదేశ దార్శనికతను బలోపేతం చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి దృఢంగా, ఐక్యతగా ఉండడానికి ఈ వాకథాన్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ముందుగా దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిపాలనా భవనం నుంచి నిట్ తూర్పు ముఖద్వారం వరకూ నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి – భీమవరం

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజల నుంచి అందే అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక–మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుంచి 209 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అన్నింటికీ చివరి తేదీ వరకూ ఆగకుండా ముందుగానే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అర్జీల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలన్నారు. అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో సమాధానాన్ని రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని, వాట్సాప్ ద్వారా గాని పంపాల్సి ఉందన్నారు. కోర్టు కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి దోసిరెడ్డి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాది ఎస్ఆర్ మృతికి సంతాపం

నరసాపురం : హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్ఆర్.సంకు(సంకు శ్రీనివాసరావు) ఆకస్మిక మృతి పట్ల నరసాపురం న్యాయవాదుల సంఘం ప్రగాఢ సంతాపం తెలిపింది. ఆయన మృతిచెందిన సమాచారం తెలియగానే సోమవారం బార్ అసోసియేషన్ హాల్లో అధ్యక్షులు చేగొండి మోహన బాలాజీ అధ్యక్షతన న్యాయవాదులు సభ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్తూరు గ్రామానికి చెందిన ఎస్ఆర్.సంకు హైకోర్టు న్యాయవాదిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు అడబాల సుబ్రహ్మణ్యం, పోలిశెట్టి నారాయణ స్వామి(బాబ్జీ), పోలిశెట్టి శ్రీరఘురామారావు, నల్లిమిల్లి జోసెఫ్, పోలిశెట్టి సూరిబాబు, చల్లా దానయ్య నాయుడు, దేవ రంజిత్ కుమార్, కామన బాల సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ రంపా పుల్లాజీ మాట్లాడుతూ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేసిన ఎస్ఆర్.సంకు మృతి బాధాకరమని పేర్కొన్నారు. న్యాయవాదిగా పలు ముఖ్యమైన కేసులను వాదించిన ఆయన ప్రజలకు మంచి సేవలు అందించారని నివాళులు అర్పించారు. ఎస్ఆర్.సంకు మృతి పట్ల న్యాయవాదులు కానూరి స్వామినాయుడు, పుప్పాల వెంకటకృష్ణారావు, జె.సైమన్ విజయకుమార్, అందే ఆచార్యులు(రాజా), వైదాని నాగేశ్వరరావు, కొత్తపల్లి రమేష్, విన్నా సూర్యప్రకాష్, మోచర్ల సత్యకృష్ణ, గునిశెట్టి శ్రీనివాసరావు, పూరిళ్ల శ్రీనివాస్, తంగెళ్ల వెంకటేశ్వరరావు, కురెళ్ల సోమశేఖర్, యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, బూసి విశ్వేశ్వరరావు, ఇంజేటి జాన్ కెనడి, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు సంతాపం తెలిపారు.

చౌక ధరలకు నిత్యావసర సరుకులు

తహశీల్దార్ రాజరాజేశ్వరి

నరసాపురం : ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెల్లరేషన్ కార్డు దారులకు చౌక ధరలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. తెలుపు రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యంతో పాటు అరకిలో పంచదార రూ.17కు, కేజీ కందిపప్పు రూ.67కు సరఫరా చేస్తున్నామన్నారు. నిత్యావసర సరకుల పంపిణీలో లోటు పాట్లు ఉంటే తహశీల్దార్ సెల్ నెంబర్ 9491041465, పౌర సరఫరాల ఉప తహశీల్దార్ 994842844 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

ఎంఎల్‌సి ఓటు నమోదుకు రేపే ఆఖరు

ఆకివీడు : మరికొద్ది రోజుల్లో జరగబోతున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియ కార్యక్రమం ఆరో తేదీ బుధవారంతో ముగుస్తుందని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు వెయ్యి మంది తమ ఓటు నమోదు చేసుకున్నారని ఆయన అన్నారు. గత ఎన్నికల్లో 2,101 మంది ఓటర్లు ఉన్నారని, మిగిలిన పట్టభద్రులైన ఓటర్లు అదరూ వెంటనే ఈ రెండు రోజుల్లోనూ తమ ఓట్ల నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తులు తమ కార్యాలయంలో దొరుకుతాయని తెలిపారు.

మొగల్తూరు : ఎంఎల్‌సి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదు చేసుకునేందుకు గడువు ఈనెల 6తో ముగియనుందని తహశీల్దారు కె.రాజకిషోర్ తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం పలు రాజకీయపార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు నమోదుకు విద్యార్హత, అంతర్జాలంలో, పత్రాలు అందించడం ద్వారా చేసే విధానాలను ఆయన వివరించారు. టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

గణపవరం : గ్రామంలో దోమల నివారణకు స్థానిక పంచాయతీ అధికారులు ఫాగింగ్ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి డిఎస్ఆర్ .ప్రసాద్ మాట్లాడుతూ గణపవరం పంచాయతీ పరిధిలోని 16 వార్డులలో దోమల నివారణకు ఫాగింగ్ పిచికారీ చేస్తున్నట్లు చెప్పారు. పిచికారీ చేసే సమయంలో దట్టమైన పొగ వస్తుందని, స్థానికులు ఆందోళన చెందనవసరం లేదని అన్నారు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

జనసేనలో చేరికలు

గణపవరం : మండలంలో సోమవారం గ్రామ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, నాయకులు వైసిపికి రాజీనామా చేసి స్థానిక ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు సమక్షంలో జనసేనలో చేరారు. జనసేనలో చేరిన వారిలో గణపవరం సర్పంచి మూరా అలంకారం, కాశీపాడు సర్పంచి తెర్లినాగరాజు, వైసిపి ప్రచారకమిటీ అధ్యక్షులు గాజుల వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల నుంచి 150 మంది వైసిపి నేతలు చేరినట్లు తెలిపారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మీథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్, ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్,అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జివిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845, -DRNO :10-11-5/2 , 1 st Floor, Ganesh Chowk Center , Near Ravindra bharathi school, NIDADHAVOLU
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-11-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2638.07 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, , Opp.Zed Labs, R.R.Peta, Eluru- 534 002. నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road,
Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager,
p.hemanth kumar-80746-56196

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కాకినాడ
D.O.P. No. 30/2022
Between:
ముదపాక సంతోష్‌కుమార్ -పిటిషనర్
మరియు
ముదపాక (జుత్తుక) జ్యోతి ప్రియాంక -రెస్పాండెంటు
రెస్పాండెంటు అడ్రసు:
ముదపాక (జుత్తుక) జ్యోతి ప్రియాంక, W/o. సంతోష్‌కుమార్, వయస్సు 28 సం॥రాలు, D/o. జుత్తుక పరమేశ్వరరావు, డోర్ నెం. 13-2-8, గుబ్బల కేశవరావు వీధి, ఉండ్రాజవరం రోడ్, తణుకు – 534211, పశ్చిమగోదావరి జిల్లా.
పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు వారి ద్వారా సమనులు పంపించినను తీసుకొనక బుద్ధిపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున సదరు కోర్టు వాయిదా 26-11-2024 సం॥రం తేదీన ఉదయం 10.30 ని॥లకు ఉండి ఉన్నది. ఆరోజు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఏమైన ఉన్నచో తెలియపరచుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం తెలుపబడును.
(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
ఏలూరి సుబ్రహ్మణ్యం, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9848333171

దస్తావేజులు పోయినవి
ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, పెద నింద్రకొలను గ్రా కాపురస్తులు పచ్చాకుల వెంకట సుబ్బారావు, తండ్రి: పచ్చాకుల సత్యనారాయణ అను నా యొక్క ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెం.3086/2019, ది.30-10-2024వ తేదీ నా స్వగ్రామం పెదనింద్రకొలను నుండి గణపవరం జిరాక్సు సెంటరుకు జిరాక్సు తీయించు నిమిత్తం వెల్లుచుండగా దారి మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.
పచ్చాకుల వెంకటసుబ్బారావు
తండ్రి: పచ్చాకుల సత్యనారాయణ,
పెదనింద్రకొలను, నిడమర్రు మండలం,
ఏలూరు జిల్లా. సెల్: 9346446111